# తూర్పుచెరువు

తూర్పు చెరువు చూస్తున్న సూర్యుడి ముఖం ఇవ్వాళ వెల వెలపోతోంది. రోజూ వెల్లివిరిసే ఆనందం మటుమాయమయింది. ఆశ్చర్యం, విచారం పెనవేసుకొని సహజకాంతిని తగ్గించాయి. ఇతర గ్రామాల మాట ఎలా వున్నా ఆ సమయంలో తూర్పు చెరువు చూడడానికి శోభాయమానంగా వుంటుంది. మరి ఈ రోజు ఆ శోభలన్నీ ఏమైపోయాయి? తోటి యువతులతో ముచ్చట్లు కాసేపైనా చెప్పుకోవాలని మనస్సు ఆరాటపడుతున్నా తర్వాత చేయవలసిన పనుల దొంతరల్ని తల్చుకొని గబగబా బిందె చంకన పెట్టుకునే గ్రామ సుందరాంగుల జాడలేవి? అవలీలగా బిందెల్ని పరుగులాంటి నడకతో తీసుకుపోయే యువకులు ఆదమరచి నిద్రపోతున్నారా? గ్రామ చావడి దగ్గర చేరి దినపత్రిక వార్తలు గురించి ముచ్చటించుకునే వృద్ధ గ్రామీణులు వేరే పనుల్లో నిమగ్నమయ్యారా? ఇలా ఎన్నెన్నో దృశ్యాలు కన్పించడంలేదు. అందుకే సూర్యుని ముఖంలో ఆ ఆవేదన.

నిజానికి లోకమంతా చుట్టివచ్చే సూర్యుడు ఈ చిన్న గ్రామం గురించి అంతగా కలవరపడవలసిన హేతువు లేదని చెప్పాలి. కాని ఆయనకీ మనస్సుంది. మమతానురాగాలున్నాయి. అభిరుచులూ, ఆప్యాయతలూ లెక్కకు మించే వున్నాయి.

ముఖ్యంగా అది తనకు ఇష్టమైన వూరు. తూర్పు చెరువు వూరన్నా, ఆ వూరు చెరువన్నా సూర్యుడికి వల్లమాలిన అభిమానం. లోకసంచారానికి బయలుదేరినప్పుడు ముందు తూర్పు చెరువు అందాన్ని తనివితీరా చూసిన తర్వాతే గమనవేగం పెంచుతాడు. ఆ చెరువు పరిశుభ్రతకి మారుపేరు. గట్టుమీద వున్న గాంధీ, నెహ్రూ, నేతాజీ, అంబేద్కర్ విగ్రహాలు బాగా ఆకర్షిస్తాయి. దేశంలో లక్షలాది విగ్రహాలు రోజూ చూస్తూనే వుంటాడు. కింద పేరు చూసిగాని పోల్చుకోలేని సందర్భాలే ఎక్కువ. అప్పుడు చేసేది లేక చూపులు పక్కకు తిప్పి ముందుకు సాగిపోతాడు. తూర్పు చెరువు సంగతి వేరు. ఈ ఊరూ, ఈ ప్రజలూ బాగా నచ్చి, ఆ నాయకులు శాశ్వతంగా ఇక్కడే వుండిపోయేందుకు నిశ్చయించుకుని ఇచ్ఛాపూర్వకంగానే శిలలుగా మారారా అనిపిస్తుంది. అంత జీవకళ వుట్టిపడుతుంది.

ఇక్కడున్న చెరువుకు కట్టుబాట్లు అన్నీ యిన్నీ కావు. ఇతర చోట్ల స్నానాలు చేయడం, బట్టలుతకడం, బర్రెల్ని కడగడం వంటి దృశ్యాల్ని చూస్తున్న సూర్యుడికి తూర్పు చెరువు వింతగా తోచడం సహజమే. ఇంకా బాగా ఆకట్టుకునేది అక్కడున్న గ్రామ చావడి. ప్రతి వూళ్ళో వుండేదే కాని, దీని వైనం వేరు. ఆలయం తర్వాత గ్రామవాసులంతా దీనిని పవిత్రంగా పరిగణిస్తారు. దీనికి ఎదురుగా వున్న

చిన్నజెండా గట్టుకు కూడ అంత పవిత్రత వుంది. ఎవరూ దాని మీద కాలు పెట్టడం గాని, కూర్చోడం గాని ఇంతవరకు జరగలేదు. స్వాతంత్ర్య దినోత్సవం నాడూ, గణతంత్ర దినోత్సవం నాడూ అక్కడ జాతీయ పతాకం రెపరెప లాడుతుంది. అందుకే అది పవిత్ర వేదిక. దేశభక్తికీ, జాతీయ స్ఫూర్తికీ ప్రతీక. ఈ వేదికను ప్రతిరోజూ నీటితో శుభ్రపరుస్తారు, దైవాన్ని అభిషేకించినట్లు! ఇలాంటి దృశ్యాన్ని చూస్తూ సూర్యుడు పరవశుడై కాసేపు నడక ఆపాలనిపిస్తుంది. కాని ఎలా సాధ్యం?

సూర్యుడికిష్టమైన దిక్కు తూర్పు. అటువైపు వున్న చెరువు తూర్పు చెరువు. ఆ వూరికి కూడా అదే పేరు పెట్టడం కూడా దీనిపైన మక్కువ పెంచుకోవడానికి కారణం కావచ్చు. ఆదిత్య హృదయం అర్థం చేసుకుంటే మరో ముఖ్యమైన సత్యం బయటపడుతుంది. ఆ వూరికి వెన్నెముక, పెద్ద దిక్కు, మార్గదర్శి పేరు సూర్యనారాయణ కావడం. ఆయన ఆదర్శ పురుషుడై తన పేరుకే వన్నె తేవడం వల్ల సూర్యుడికి ఈ వూరు మరింత ప్రీతిపాత్రమై వుండవచ్చు.

తూర్పు చెరువుకు ఇంత ఖ్యాతి తెచ్చిపెట్టిన సూర్యనారాయణ పూర్తి పేరు అంతే! ఇంటి పేరు లేదు. పేరు చివర ఇంకేమీ లేదు. ఒకప్పుడు వుండేది. వాటిని వదిలేసి అరవై అయిదు సంవత్సరాలు దాటింది. తన కులం, తన మతం, తన వ్యక్తిత్వం, తన అస్తిత్వం అన్నీ భారతీయతే అని గాఢంగా నమ్మినవాడు. అలా ఆచరిస్తున్నాడు. 'తూర్పు చెరువు గాంధీ' అని అందరూ పిలుస్తున్నా తాను మాత్రం సాధారణ ప్రజా సేవకుడినని వినమ్రంగా ప్రకటిస్తున్న నిరాడంబరుడు, కర్మయోగి.

సూర్యనారాయణ మహాత్మాగాంధీని పూర్ణపురుషుడిగా భావిస్తాడు. భావించడమే కాదు - గాంధీజీ మార్గాన్ని త్రికరణ శుద్ధిగా అనుసరించడం ఆయన ధ్యేయం. దీని సాధనకు ఎంచుకున్న కేంద్ర బిందువు తూర్పు చెరువు. తాను పుట్టి పెరిగినచోటు.

మహనీయుల ప్రభావం ఎంత బలీయంగా వుంటుందో చూపడానికి మంచి ఉదాహరణ సూర్యనారాయణ. మహాత్మాగాంధీ తెలుగునాట పర్యటించేనాటికి సూర్యనారాయణ వయస్సు పధ్నాలుగు సంవత్సరాలు. తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. అది 1929 ఏప్రిల్ 12. తండ్రితోపాటు సూర్యనారాయణ నాలుగు మైళ్ళు నడిచి ఎలకుర్రు వెళ్లాడు. అది కాశీనాథుని నాగేశ్వరరావు జన్మించిన గ్రామం. కృష్ణాజిల్లాలో వుంది. శ్రీ శ్యామలా ధర్మ పాఠశాల ఆవరణలో గాంధీజీని దర్శించాడు. అదొక అత్యద్భుత సన్నివేశం. మహాత్ముని ప్రబోధ వాక్యాలు ఆ పసి హృదయాన్ని అనూహ్యమైనంతగా ప్రభావితం చేశాయి. నాగేశ్వరరావు వంటి దేశభక్తుడి గ్రామంలో ఇంకా చాలా మంది విదేశీ వస్త్రాలు ధరించడం పట్ల గాంధీజీ విచారం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యోద్యమానికి గాంధీజీ ఇచ్చిన పిలుపు ఆ క్షణంలోనే సూర్యనారాయణ జీవితగమనాన్ని మార్చివేసింది. అతని జీవితం అప్పుడే జాతికి అంకితమైపోయింది.

బడికి స్వస్తి చెప్పాడు. ఉద్యమప్రవాహంలో ఒక తరంగమయ్యాడు. ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని, బాగా దెబ్బలు తిన్నాడు. వ్యక్తి సత్యాగ్రహంలో జైలు

శిక్ష అనుభవించాడు. 'క్విట్టిండియా' ఉద్యమకాలంలో కఠిన కారాగారవాసం గర్వకారణంగా భావించాడు.

వాస్తవానికి సూర్యనారాయణ ప్రజాసేవా కృషి స్వాతంత్ర్యానంతరం బహుముఖీనంగా విస్తరిల్లింది. తల్లిదండ్రులకు తానొక్కడే సంతానం. దేశ సేవే, ప్రజాభ్యుదయమే తన ముందు నిలిచిన లక్ష్యం. తల్లిదండ్రుల వేదన అర్థం చేసుకున్నా వివాహానికి సమ్మతించలేదు. ఏ లోటు రానీయకుండా వారికి పరిచర్యలు చేశాడు. అలాంటి పుత్రుణ్ణి కన్నామనే గర్వంతో వాళ్ళు కన్నుమూశారు.

గాంధేయమార్గంలో సూర్యనారాయణ తూర్పు చెరువు గ్రామాన్ని అత్యంత ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దేందుకు దివారాత్రాలు శ్రమించాడు. నిర్మాణ కార్యక్రమాలు విజయపరంపరలయ్యాయి. గ్రామస్థులందరు స్నేహ హస్తం అందించారు.

సూర్యనారాయణ తనకున్న నాలుగెకరాలు భూమిలేని నిరుపేదలకు పంచాడు. స్వాతంత్ర్య సమరయోధుడిగా తనకు వస్తున్న పింఛనులో తన కనీసవసరాలకు కొద్దిగా వుంచుకొని, మిగిలినదంతా గ్రామాభ్యుదయం కోసమే వినియోగిస్తున్నాడు.

తూర్పుచెరువు గాంధీ సార్థక నాముడయ్యాడు. ఆయన మార్గదర్శకత్వం కింద తూర్పు చెరువు ఖాదీ, కుటీర పరిశ్రమలు, సంఘ సంక్షేమం, సంస్కరణ, పారిశుద్ధ్యం, మద్యపాన నిషేధం, అస్పృశ్యతా నివారణ, దళిత జనోద్ధరణ, పంచాయతీ పాలన, విద్యావ్యాప్తి, అక్షరాస్యత, గ్రంథాలయం, సహకారోద్యమం, పేదలకు గృహవసతి, రైతుజన శ్రేయస్సు - ఇలా ఒకటేమిటి, అన్ని రంగాలలోను అగ్రగామిగా నిలిచింది. గ్రామవాసులు ఐకమత్యంతో, ఆనందంతో, శాంతియుత జీవనం గడుపుతున్నారు.

పూరిపాకే ఆయన నివాసం. ఆయనది అత్యంత సాధు జీవనం. ఎక్కువ భాగం పగలు గ్రామ చావడిలో గడుపుతాడు. ఎవరికేసమస్య ఎదురైనా దానికి శాంతియుత పరిష్కారం తూర్పు చెరువు గాంధీ నుంచి లభిస్తుంది.

సందర్భం వచ్చినప్పుడల్లా జాతీయత గురించీ, దేశభక్తి గురించీ చెబుతుంటాడు. జాతీయ గీతం, జాతీయ పతాకం, జాతీయ చిహ్నం గురించి రూపుదాల్చిన దేశభక్తితో వివరిస్తుంటే ఎన్నిసార్లయినా వినాలనిపిస్తుంది. ఆ పతాక వేదిక దగ్గర నిలబడి ఆయన ప్రసంగిస్తుంటే భక్తుడు తన ఆరాధ్య దైవాన్ని సన్నుతిస్తున్నట్లే వుంటుంది. చాలా చిన్న గట్టుగా నిలిచిన ఆ పతాక వేదికను నిన్న రాత్రి వరకు గ్రామంలో ప్రతి ఒక్కరూ దివ్య స్థలంగా మనసా వాచా కర్మణా పరిగణించారు.

ఆ అర్ధరాత్రి కొందరు యువకుల మనస్సుల్లో పవిత్ర పతాక వేదికను దురుపయోగం చేయాలనే ఆలోచన కలిగింది. శీఘ్రంగా నిర్ణయం తీసుకున్నారు. తాము బలపరచే రాజకీయ పక్షం పతాకను అక్కడ మరుసటి ఉదయమే ప్రతిష్ఠించాలనుకున్నారు. సహచరులకు వార్త అందించారు. ఇది ప్రత్యర్థి పక్షం వారి చెవిని పడింది. క్షణాల మీద వారూ అదే మాదిరి నిర్ణయానికి వచ్చారు. రెండు వర్గాలు

చేసుకున్న నిర్ణయాలు తెల్లవారేటప్పటికి ఊరంతా పాకాయి. ఈ కార్యక్రమం శాంతియుతంగా జరిగే అవకాశం ఏమాత్రం లేదు. ఒకేచోట రెండు పతాకాలు ఎగరవు. పైగా అది చాలా చిన్నస్థలం. కాని ఎంతో పవిత్రమైంది. కేవలం జాతీయ పతాక కోసమే ఉద్దేశించిన పరమ పావన వేదిక.

శాంతియుత ప్రజాస్వామ్య విధానాన్ని సూర్యనారాయణ బలపరుస్తాడు. దౌర్జన్యాన్ని కాదు. ఆయన కోరేది సమైక్యత, సామరస్యం. వైరం, దౌర్జన్యం కాదు. ఆయన అహింసా వాది. హింసను ఎన్నడూ ఆయన అంగీకరించడు.

మరికొద్దిసేపట్లో జెండా గట్టు దగ్గర జరగబోయేది తూర్పు చెరువు చరిత్రలో ఇంతవరకు లేని విషాద సంఘటన. రెండు వర్గాల మధ్య హోరాహోరి పోరాటం. యువకుల రక్తంతో ఆ స్థలం బీభత్సంగా మారక తప్పదు.

సూర్యుడు నిస్సహాయంగా వేడి నిట్టూర్పులు విడుస్తున్నాడు. తూర్పు చెరువు గాంధీ అలా వూరుకోలేడు. ఆయన ప్రాణాలన్నీ ఆ పవిత్ర వేదిక చుట్టూ అల్లుకున్నాయి.

గ్రామంలో స్త్రీలంతా భయభ్రాంతులై బయటికి రావడానికి భయపడుతున్నారు. వయోధికులు ఏం చేయాలో తోచక సూర్యనారాయణ వద్దకు బయలుదేరారు.

అయితే, సూర్యనారాయణ ఎవరి కోసం ఆగలేదు. ఆగే వ్యవధి లేదు. ముందు వేదిక పవిత్రతను రక్షించాలి. ఈ పవిత్ర కర్తవ్యంలో తన ప్రాణాలు పోతే మరింత ధన్యుణ్ణి అనుకున్నాడాయన. తనకు ఎంతో అభిమాన పాత్రమైన చిత్రపటాన్ని తీసుకొని ఖద్దరు శాలువా కప్పుకొని అతి శీఘ్రంగా అందరికంటే ముందే పతాకవేదిక చేరుకున్నాడు. వేదిక చుట్టూ పటంతో మూడుసార్లు ప్రదక్షిణం చేశాడు. నమస్కరించాడు. పటాన్ని పదిలంగా గుండె దగ్గర దాచుకున్నాడు. నేల మీద కూర్చుని జెండా గట్టును పొదివి పట్టుకున్నాడు - తల్లిని పట్టుకున్న బిడ్డ మాదిరి.

రెండు వర్గాల యువకులు జెండాల కోసం పొడుగాటి వాసాలతో, కొట్లాట వస్తే తలపడేందుకు గట్టి కర్రలతో వేదిక వైపు వస్తున్నారు. ఊరి పెద్దలు వారి వేగాన్ని అందుకోలేకపోతున్నారు. రెండు వర్గాలూ కౌరవ సైన్యంగానే తోచాయి.

పతాక స్థలం వద్దకు రాగానే ఇరువురికీ ఆవేశాలు పెరిగాయి. కర్రలు బలంగా లేచాయి. తారసపడ్డాయి. కొన్ని కర్రలు తల్లిలాంటి వేదికను ఆశ్రయించిన తూర్పు చెరువు గాంధీపై ప్రభావం చూపాయి.

అప్పటికి అక్కడికొచ్చిన పెద్దలు కలగజేసుకున్న తర్వాత కర్రల తాండవం ఆగింది. గ్రామం అంతా అక్కడికి చేరింది.

తూర్పు చెరువు గాంధీపై జరిగిన దౌర్జన్యానికి గ్రామస్థులంతా చలించిపోయారు. వెంటనే ఆయనకి వైద్య సహాయం కోసం ఏర్పాట్లు చేయడానికి సిద్ధమవుతున్నారు. బట్టలు రక్తంతో తడిసినా ఆయన పట్టుకున్న పటం మాత్రం భద్రంగా వుంది. అది భరతమాత పటం. ఇక ఈ వేదికను ఖాళీగా వుంచడం మంచిది కాదని, వైద్య సహాయం పొంది ప్రాణాలు నిలుపుకోవడానికి ఆయన ఒక

షరతు పెట్టాడు. వేదిక వున్న స్థలంలో భరతమాత విగ్రహం నెలకొల్పాలని సూచించాడు. పెద్దలూ, యువకులూ అందుకు సమ్మతించారు.

జరిగిన హింసకు తలలు వంచుకున్నారు. విభేదాలు వదిలేసి కలిసికట్టుగా గ్రామాభ్యుదయానికీ, దేశ ప్రగతికీ కృషి చేస్తామని ప్రతిజ్ఞ తీసుకున్నారు. భరతమాత విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి వెంటనే ప్రయత్నాలు ప్రారంభిస్తామన్నారు. తూర్పు చెరువు గాంధీ పెదవులు చిరునవ్వుతో మెరిశాయి. సూర్యుడు కలత వదిలి లోక సంచారానికి బయలుదేరాడు.

*('సరికొత్త కథ' కథాసంకలనం - 1995)*